# దృక్కోణాలు

సత్యం మాష్టారు, మాధవః

మాష్టారి వంటింట్లో బ్రేక్‌ఫాస్ట్‌కి ఉప్మా తయారు చేసే ప్రయత్నంలో ఉన్నాం, నేను మాష్టారు.

"ఉప్మాలో ఉల్లిపాయలు ఎక్కువ ఉండాలా? టోకెన్‌గా ఒక ఉల్లిపాయ తరిగితే చాలా?" నా ప్రశ్న. పొద్దున్నే ఉల్లిపాయ తరగాలంటే చాలా కష్టం కదా! ఒకటి తరిగితే కన్నీళ్ళు కారటం మొదలెట్టకముందే తరగటము పూర్తవు తుంది.

"ఉల్లిపాయలు ఎన్ని తరగాలి అన్నది ఎంత రవ్వ వేస్తావు అన్న విషయంమీద ఆధారపడి వుంటుంది. ఒక చిన్నకప్పుకి ఒక ఉల్లిపాయ అంతకంటే ఎన్ని కప్పులు ఎక్కువ అయితే అన్ని ఉల్లిపాయలు. అయితే ఉల్లి పాయలతోపాటు అల్లం, పచ్చిమిరపకాయలు కూడా సన్నగా తరగాలి. మర్చిపోకు!" మాష్టారి ఉవాచ.

"రాజమ్మగారి కోడలు కథ చెప్పనా? పాపం ఆవిడ వృద్ధాప్యంలో మంచాన పడ్డాక జిహ్వా చాపల్యం చంపుకో లేక ఒకరోజు ఉప్మా కావాలని అడిగిందిట"

మామూలుగా ఉప్మా చెయ్యటం అయిదు నిమిషాల పని అన్ని తరుక్కుని రెడీగా పెట్టుకుంటే. అయితే ఈ కోడలుగారు కొంచెం బద్ధకిష్టవడముతో "అత్తయ్య గారూ! శనగపప్పులేదు. అల్లం లేదు. ఉల్లిపాయ ఒకటే ఉంది. కరివేపాకు బయటికి వెళ్ళి తేవాలి. ఉప్మా చేసెయ్య మంటారా?" అని అడిగిందిట.

"వొద్దులేమ్మా! ఇవేమి లేకుండా ఉప్మా ఏమిటి?" అని అత్తగారు అంటే కోడలు పాచిక పారిందని సంతోషించి బ్రెడ్ ముక్కలు టోష్టు చేసి అత్తగారికిచ్చి చేతులు దులిపేసుకుందిట.

"శనగపప్పు, అల్లం ఏమిటి మాష్టారూ, ఇవన్నీ కూడా వెయ్యాలా?" అయోమయంగా అడిగాను.

పోపులో శనగపప్పు, మినపప్పు, ఆవాలు ఒక చిన్న సగం తుంచిన ఎండుమిరపకాయ అన్నీ వేగాక కరివేపాకు వేసి ఘుమఘుమలాడాకా సన్నగా తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిరపకాయలు వేసి వేయించాలి. అదయ్యాక కప్పుకి రెండు కప్పుల నీళ్ళుపోసి మరిగాక వేయించిపెట్టు కున్న రవ్వ కొంచెం, కొంచెం వేస్తూ కలుపుతూ పోవాలి.

చెప్పటంతో పాటు చెయ్యటం కూడా పూర్తిచేసి మూకుడుమీద మూత పెట్టి రెండు నిమిషాలు మగ్గనిచ్చి స్టవ్ కట్టేసి బయటికి వచ్చాం నేను మాష్టారు. అన్ని సమ పాళ్ళలో వేయవనుకో నీ ఉప్మా ఎ.పి ఎక్స్‌ప్రెస్ పాంట్రీ కార్లో చేసిన ఉప్మాలా వుంటుంది. లేకపోతే రాజమ్మ గారి కోడలు చేసిన ఉప్మాలా వుంటుంది. అంతా అయ్యాక కొలెస్ట్రాల్ బాధ లేకపోతే ఒక చెంచా నెయ్యి కూడా వేసుకో వచ్చు. వేడి వేడిగా పచ్చడితో తింటే నెయ్యి వెయ్యక పోయినా పర్వాలేదనుకో!

"పచ్చడా? ఏం పచ్చడి?"

"అది రేపు చెప్పుకుందాం! ఇప్పటికి టైము అయి పోయింది మరి! ఇడ్లీలో వేసుకునే పచ్చడే ఇందులో కూడా నంచుకోవచ్చును. ఇవ్వాల్టికి ఉప్మా ఊరగాయతో తిందాం. అన్ని సమపాళ్ళలో పడితే అన్యోన్యమైన సంసారంలా ఉప్మా వుట్టేది తిన్నా బాగానే ఉంటుంది"

"తిందామా?" మాష్టారి ప్రశ్నకి సమాధానంగా తలూపి ఆలోచనలో పడ్డాను. నా కళ్ళముందు పోపులో చిటపటలాడుతున్న ఆవాలులాగా ధుమధుమలాడు తున్న సుజాత ముఖం కనిపించింది. నిట్టూర్చి నా భావా లని అణుచుకుని మాష్టార్ని అనుసరించాను.

❖ ❖ ❖

అమ్మ మ్మ తాతయ్య, సుజాః

ఆరోజు అమ్మమ్మ అయిదు గంటలకే లేచి మనవ

**డా॥ కల్లూరి శ్యామల**

రాళ్ళి లేపటానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది.

"సుజా, లేవవే నా తల్లీ, ఎప్పటినుంచి లేపుతున్నాను. ఇలా అయితే నువ్వు లేచినట్టే పనులు చేసుకున్నట్టే. పొద్దున్నే లేచి తాతయ్యగారి దగ్గర పాఠాలు చెప్పించు కుంటానన్నావు. మళ్ళీ ఆయన వెళ్ళిపోయారంటే రాత్రి పొద్దుపోతేగాని రారు. నీ ఇష్టం. తర్వాత" చివరచివర్లో ఆవిడ గొంతులో ధ్వనించిన విసుగు కనిపెట్టి లేచి...

"సారీ అమ్మమ్మా, రాత్రి పడుకునేటప్పటికి మూడ యింది. కరెక్టుగా పదిహేను నిమిషాల్లో తయారై తాతయ్యగారి గదిలో వుంటాను"

కరెక్టుగా పదిహేను నిమిషాల తర్వాత తాతయ్యగారి రూములో ఆయన చదువుకుంటున్న టేబిలు ఎదురుగా వున్న కుర్చీలో కూచుంటూ "సారీ తాతయ్యా, ఎంత త్వరగా లేవాలనుకున్నానో అంత లేటయింది"

"పర్వాలేదులేమ్మా, మనిషన్న తర్వాత ఆరేడుగంటల నిద్ర తప్పనిసరిగా వుండాలికదా! ఏమిటి ఏదో తెలుసు కోవాలన్నావుట. నీకు కావల్సినదేదో చెప్పి వెళ్దామనే కూర్చున్నాను"

"ఏంలేదు తాతయ్యా, ఏదో పదిహేనువేలిస్తా మన్నారుకదా అని ఈ ఆఫీసులో చేరానేకానీ నాకిష్టమయి నట్టు బతకాలంటే నెమ్మదిగా క్వాలిఫికేషన్ పెంచుకుంటే గాని అయ్యేటట్టు లేదు. రోజు ఒంటిగంటదాకా ఆఫీసు ఎలాగో లేదుకదా పొద్దున్పూట మీ దగ్గర ట్యూషన్ తీసు కుని ఎమ్.ఎకి కడదామని వుంది"

"ఆలోచన మంచిదే కానీ నేనెంతమట్టుకు చెప్పగలను అనేదే ప్రశ్న. ఈరోజుల్లో సిలబస్ ఎంత మారిపోయిం దంటే నేను చదువుకున్న పాఠాలు చెప్పిన రోజులు వేరు, ఇప్పటి రోజులు వేరు. అంతకన్నా ఏదైనా టుటోరియల్ కాలేజీలో చేరితే మంచిదనుకుంటాను"

"నిజం చెప్పాలంటే తాతయ్యా, మళ్ళీ పొద్దున్న పూట కూడా బయటకెళ్ళాలంటే కుదుర్తుందో, లేదో ఆలోచించండి"

"కష్టమేననుకో, కానీ కొంచెం శ్రమపడితేగానీ అను కున్నవన్నీ హాజరు పరచుకోలేముకదా! ఆలోచించుకుని చెప్పు. అప్పుడు నేను వెళ్ళి నారాయణా టుటోరి యల్స్‌లో మాట్లాడతాను"

పెళ్ళి అయ్యేటప్పటికి బి.ఎ చదివి బి.ఎడ్ పూర్తిచేసి అంతకు రెణ్ణెల్లకి ముందే ఒక లోకల్ స్కూల్లో టీచరుగా చేరాను. లోకల్ ప్రైవేట్ స్కూలు కావటంతో పని ఎక్కువ జీతం తక్కువ అనిపించేది. దానికతోడు మాధవ్ కెరి యర్ సాఫ్ట్‌వేర్ సెక్టరులో అవటంతో ఇద్దరికీ ఆఫీసు

## సీమ విలాపం!

ఈ భూమ్మీద నదులింకిపోయి
సముద్రాలు బతుకుతున్నాయి
పొలాలెండిపోయి
ఎడారులు నవ్వుతున్నాయి
వసంతాలు గడ్డకట్టి
శిశిరాలు విస్తరిస్తున్నాయి
కళ్ళుమూసినా, తెరిచేవుంచినా
దిగులు, దిగులుగా
దిగుడు బావి దుఃఖంలా
ఒకటే అశాంతి, ఆందోళన
ఎవరో ఈ దేహంలోకి
మేకులు దిగ్గొడుతూ
లోలోపలి మూలుగుల్ని
రికార్డు చేస్తున్నట్టుగా
అలజడి మొదలైంది
ప్రవాసంలోంచి పెల్లుబికి నైరాశ్యంలోకి
వలసల పర్వం మొదలైంది
ఆకలి కుంపటిలోంచి ఎగిసిన రవ్వలన్నీ
ఎడారిసీమను భగ్గున మండిస్తున్నాయి
పూకు నిత్యం ఆకలిరాత్రులూ కన్నీటి
సుర్యోదయాలే
ముడుపుగట్టుకున్నా భవిష్యత్తు
చావును ముద్దాడుతోంది
ఇక్కడ మనిషికీ, పశువుకూ తేడాలేదు
ఆకలి... ఆకలేకదా!

డాక్టర్ రాధేయ

టైమింగ్స్ అస్సలు కలిసేవి కావు. మాధవ్ రాత్రంతా పని చేసి ఏ తెల్లవారురుఝామునో వచ్చి పడుకునేవాడు. తను అతను లేవకుండానే ఏడుగంటలకల్లా ఇల్లు వదిలి వెళ్ళి పోయేది. కలిసి వుండే టైము చాలా తక్కువ అవటంతో ఇద్దరికీ ఒకర్ని ఒకరు అర్థంచేసుకునే టైమే దొరకలేదు అని చెప్పాలి. ఇప్పుడు ఇంత అవగాహనతో ఆలోచించ గలిగిన తనకి అప్పుడు అస్తమాను ఒక్కత్తినీ పగలంతా

గడపవలసి రావటంతో మాటిమాటికి విసుగొచ్చేది. తనతో కలిసి గంట మాట్లాడే టైము వుండేది కాదని తను బాధపడి భర్తని బాధపెట్టడం తల్చుకుంటే ఇప్పుడు అసంబద్ధంగా అనిపించినా అప్పుడు అదే జీవితానికి ఒక పెద్ద సమస్యలా అనిపించేది.

ఇప్పుడో తను చేసే స్కూలు టీచరు ఉద్యోగంతో కనీస అవసరాలుగూడా తీరవని అర్థం అయ్యేసరికి ఏం చేసైనా అర్హతలు పెంచుకుంటే కానీ భర్తని కాదని వచ్చేసిన తనకి మనుగడ కూడా కష్టమని తెలిసివచ్చింది. మళ్ళీ చదువు మళ్ళీ ఉద్యోగాల వేట విసుగనిపించినా ఇప్పుడు ఏంచేసైనా తనను తను నిరూపించుకోవాలనే తాపత్రయం అన్ని విసుగులనీ దూరం చేస్తోంది. చదవాలి, మంచి ఉద్యోగం సంపాదించి తన కాళ్ళమీద తను నిలబడగలగాలి. అప్పుడే తన పంతం నెరవేరినట్టు. అప్పటిదాకా పదివేలు జీతమని లోభపడి ఈ కాల్ సెంటర్ జాబులో చేరింది.

ఆరోజే నెట్లో వెతికి కోర్సెస్ గురించి ఒక డెసిషన్ తీసుకుని పగలు టుటోరియల్ కాలేజి, రాత్రి కాల్ సెంటర్ డ్యూటీలతో బిజీ అయిందంటే అసలు వేరే వాళ్ళతో కబుర్లకి టైమే దొరకదు.

తాతయ్య రాత్రి అమ్మమ్మతో అదే విషయం చెప్పారు. పక్కనే వున్న గదిలో నేను వాళ్ళ సంభాషణ వింటూనే ఉన్నాను. ''పంతానికి వచ్చేసి తప్పే చేసిందనుకో, నాలుగు రోజుల్లో సాదకబాధకాలు అర్థమవుతాయనే అనుకుంటున్నాను. ఏది ఎలావున్నా ఆడా మగా అందరూ చదువుకోవాలి. ఒకళ్ళ వృత్తిలో వున్న కష్ట నిష్ఠూరాల్ని మరొకరు అర్థం చేసుకోగలగాలి. మన రోజుల్లోలా కాదు. ఆడది ఇంట్లో మగాడు బయట అని పనులు సర్దేసుకుని సుఖంగా వున్నామనుకోవటానికి.

''అప్పుడు కూడా సుఖం అంటే మగాడు అనుభవించాల్సిన విషయమనుకుని మగపిల్లల్ని అలా పెంచాం. కాబట్టి ఈరోజు ఆడపిల్లలు కోరుకుంటున్నదేమిటో అర్థంచేసుకోలేకపోతున్నాం. సమాజం కూడా ఆడది ఇల్లు వదిలితే బరితెగించిందన్న పదమే వాడతారు కానీ వాళ్ళకీ వాళ్ళు శ్రమపడి సాధించాలనుకోటాన్ని మన్నించలేకపోతున్నారు''

''మన సుజా మొగుడు అలాంటి వాడు కాదనే నా అభిప్రాయం. కాలమే చెప్పాలి దీనికి సమాధానం'' అటు తిరిగి పడుకుంటూ అన్నారు తాతయ్య.

వీళ్ళకి నా గురించి ఎంత చింత! కానీ వాళ్ళ నమ్మకాన్ని వాళ్ళు పోషించుకుంటే తనకి వచ్చిన నష్టమేమీ లేదు. ఆరోజు వాళ్ళ సంభాషణ తన పట్టుదలని ఇంకా పెంచిందని వాళ్ళకి తెలియదు. తెలిసే అవకాశం కూడా లేదు.

❖ ❖ ❖

సత్యం మాష్టారు, మాధవః

సాయంకాలం అలసిపోయి ఇంటికివచ్చినీరసంగా కుర్చీలో కూలబడ్డాను. మాష్టారు ఇంకా ఇంటికి వచ్చినట్టులేదు. మామూలుగా నాకంటే ముదుగానే వస్తారు. ఈరోజేమయిందో మరి! లేద్దామనుకుంటూనే లేవలేక కుర్చీలో కళ్ళు మూసుకున్నాను. మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగమనే గాని డబ్బు లక్షలలో వస్తుందని ఓదార్పు తప్ప సుఖం అనేదేలేదు. రక్తం, చెమట పీల్చి శరీరాన్ని పిప్పిలా, శవంలా తయారుచేస్తారు రాత్రి అయ్యేసరికి.

నేను చదువుకునే రోజుల్లో కూడా, నాలుగేళ్ళకిత్రం అంటే నమ్మబుద్ధి కావట్లేదు అనుకోండి. క్లాసులు ఎగ్గొట్టి, ప్రాక్సి అటెండెన్సులు ఇచ్చి, పార్కుల చుట్టూ, రోడ్లమీద సినిమాహాళ్ళకి చక్కర్లు కొట్టి తక్కిన కాలేజి విద్యార్థులలా ఎంజాయి చేసిన రోజులు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చును. ఎప్పుడు చూసినా, పోటీగా చదవాలి ఎక్కువ మార్కులు సంపాదించాలి అనే తపనలో కొట్టుమిట్టాడుతూ బ్రతకటం మర్చిపోయిన రోజులవి. ఉద్యోగంలో చేరితే ఏ తాపత్రయాలు ఉండవనుకుంటే పొరపాటే! అంచెలంచెలుగా నిచ్చెన ఎక్కాలనే ఆరాటం అన్ని స్నేహానుబంధాలకి దూరంగా వుంచింది. ఏ హాబీలనీ దగ్గరకి రానివ్వలేదు. నిట్టూరుస్తూ లేచాను, మాష్టారు వచ్చేలోపల పాలు కాస్తే రాగానే కాఫీ తాగచ్చు అనుకుంటూ.

వంటింట్లో అడుగుపెట్టబోతుంటే మంచి కాఫీ వాసన నాసికాపుటాలకి తగిలింది. అరే,మాష్టారు వచ్చేసినట్టున్నారే అనుకుంటూ వంటింట్లో అడుగుపెట్టాను. అప్పటికే వేడి వేడి కాఫీ కప్పుల్లో పోస్తూ మాష్టారి దర్శనం అయింది. ''మీరు వచ్చేశారా, రాలేదనుకుని పాలు పడెయ్యడానికి వచ్చాను. బ్రూ ఎలాగో వుందిగా మీరు రాగానే కాఫీ తాగచ్చు అనుకున్నాను''

''నేను నాలుగు గంటలకే వచ్చాను. అలా బజార్లోకి వెళ్ళి సామాన్లు తెచ్చి, టయిముందికదాని లైబ్రరీ దాకా వెళ్ళాను. రీడింగు రూములో ఒక గంట చదివి ఇంటికి వచ్చి కాఫీ డికాషన్ వేశాను ఇప్పుడే. నువ్వూ వచ్చేశావు. అయితే ఏదో ఆలోచనలలో మునిగిపోయావు కదా! సరేలే అక్కడే తాగుదాం అని కాఫీ అక్కడికే తెస్తున్నాను''

''డికాషన్ వెయ్యడం, ఆ గొడవంతా ఎందుకు మాష్టారూ? బ్రూ వుండనే వుందిగా?''

''ఉంది గానీ, అది ఎమర్జెన్సీకి. ఈ కాఫీ తాగి చూడు...'' ఆ కాఫీ తాగాక నిజంగానే ప్రాణం లేచివచ్చి నట్టయింది.

''ఘుమఘుమలాడే కాఫీ డికాషన్ వేడిపాలల్లో కలుపుకుని అరస్పూనుకి మించకుండా పంచదార వేసు కుని తాగితే కాఫీ ప్రాణప్రదాత అనిపించకమానదు'' మాష్టారి కళ్ళల్లో నవ్వుల ఛాయలు!

''కాఫీ అంటే వట్టి సాదా పానీయం కాదు కదా మనకి! మంచి కాఫీ ఎవరిస్తే వాళ్ళని, వాళ్ళ చేతి కాఫీని జీవి తాంతం గుర్తుంచుకుంటాం. కాఫీకి మన కుటుంబాలలో చాలా విలువ.

పెళ్ళిళ్ళలో చూడు! అస్తమానూ ఇరవై నాలుగు గంటలూ కాఫీలు సప్లయి చెయ్యటమే కాక ప్రతి కప్పు కాఫీ రుచిగా ఇవ్వగలిగిన యజమానిని అతను చేసిన పెళ్ళిని జనం కలకాలం గుర్తుంచుకుంటారు అని ఆంగ్ల రచయిత ఆర్కె నారాయణ్ అంటారు. నువ్వు చదివావో, లేదో అతని డైరీ అనే ఆత్మకథని. నిజంగానే అలాంటి గృహస్తు ప్రతిష్ఠ ఆకాశానికి ఎగసిపోతుంది. అవు నంటావా కాదంటావా?'' మాష్టారి ప్రశ్న.

''అవును నిజమే! కాఫీ చాలాబాగుంది. బ్రూ రోజు తాగాలంటే ఏంటో ఒకేలాంటి రుచితో మొక్కుబడికి తాగినట్టే వుంటుంది''

''నిజమే! ఇలాంటి అమృతంలాంటి కాఫీని మనకి నచ్చిన వాళ్ళతో పంచుకు తాగామనుకో సమపాళ్ళలో పడ్డ డికాషన్, పాలు, పంచదారల్లా జీవితంగూడా అద్భుతమైన రుచిని సంతరించుకుంటుంది. కాదన గలవా?'' మాష్టారి గొంతులో సవాలు.

''రోజూ పొద్దున్నే నేనే అయిదుగంటలకి బెడ్ కాఫీ ఇవ్వాలని ఎక్స్‌పెక్ట్ చేసే బదులు అప్పుడప్పుడు మీరు మీ చేత్తో నాకు కాఫీ ఇస్తే మీ మగతనానికి అవమానం కాదు తెలుసా?'' వ్యంగ్యంగా బాణాలు విసిరే సుజా మాటల వెనకాల ఈ అద్భుతమైన అనుభవాన్ని పంచు కోవాలనే తాపత్రయం వుండి వుంటుందనే ఆలోచన తళుక్కున మెరిసింది నా మస్తిష్కంలో!

❖ ❖ ❖

సుజా, అమ్మమ్మ:

సాయంత్రం ఏడు గంటలకి బస్సు దిగి ఉస్సురని ఊపిరిపీలుస్తూ నిట్టూర్పుతో, నిస్త్రాణతో ఇంటిముఖం పట్టాను. బయటకొచ్చి అన్ని పనులూ చేసుకోవటం అల వాటయిందనే చెప్పచ్చుకానీ అలవాటవని విషయం అంటూ ఉంటే అది బస్సుల్లో ప్రయాణం చెయ్యటం అని చెప్పచ్చు. ప్రపంచంలో దేన్నయినా పట్టుదలతో సాధించవచ్చు కానీ ఈ దేశంలో బయటకొచ్చిన ఆడ దాన్ని చూస్తే కొంతమంది మగవాళ్ళ ప్రవర్తనకి అర్థాలు వెతకటానికి మాత్రం మరో జన్మ ఎత్తాల్సిందే.

వారం రోజులుగా చూస్తోంది ఒక శాల్తీని. తనెక్కిన బస్ స్టాపు తర్వాత స్టాపులో ఎక్కుతాడు. ఎక్కగానే అతని కళ్ళు రెండూ ఆత్రం బస్సంతా కలియచూస్తాయి. తనని చూడగానే అతని కళ్ళకి బదులు కాళ్ళు పని మొదలుపెడ తాయి. అంగుళం అంగుళం జరుక్కుంటూ నెమ్మదిగా పక్కన చేరతాడు. అప్పుడు మొదలవుతుంది తనకి నరకబాధ. ఎంత వెనక్కి జరుగుదామని చూస్తే అంత మీదమీదకి వస్తాడు.

చిన్నవాడు, కాలేజి కుర్రాడు కాదు సరికదా చదువు సంధ్యలేనివాడిలాగా కూడా అనిపించడు! చూడ్డానికి గౌరవనీయ సమాజంలో నుంచి వచ్చిన ఉద్యోగస్తుడిలానే వుంటాడు. ముప్ఫైఅయిదు నలభై ఏళ్ళు వుండచ్చు కూడా. ఏంచేస్తే ఈపీడా వదుల్తుందా అని రోజులాగే ఆరోజు కూడా ఆలోచిస్తూ ఇల్లు చేరింది.

ఈరోజైతే మరీ ఆశ్చర్యం. తను రోజూఇంటికి వచ్చే టైమ్ కూడా కాదు. మామూలుగా నైట్‌డ్యూటీ చేసి అర్థ రాత్రి ఆఫీసు క్యాబ్‌లో లేటుగా ఇల్లు చేరే తను వంట్లో బాగులేకపోవడంతో ఆరింటికల్లా ఆఫీసు వదిలేసింది ఇంటికి వెళ్ళి డాక్టరు దగ్గరికి వెళ్ళామనే ఉద్దేశ్యంతో. మరి వీడు ఎలా తెలుసుకున్నాడో తను ఈ వేళప్పుడు బస్సులో వుంటానని హాజరైపోయాడు.

ఇదివరకు హాయిగా బస్సు ఎక్కక్కరలేకుండా ఐదు నిమిషాలు నడిస్తే స్కూల్లో వుండేది. తాతయ్య దగ్గరికి వచ్చాక ఈ కష్టం తప్పటములేదు సరికదా తను బయటికి వెళ్ళడానికి ఆలోచింపజేసేదేమన్నా వుందా అంటే ఈ బస్సు ప్రయాణాలే అనిపిస్తోంది ఈ వెధవవలన. క్రమ క్రమంగావాడి చేష్టలు శ్రుతిమించి రాగానపడుతున్నాయి. తన శరీరంలో వాడి చెయ్యి తగలని చోటంటూ లేకుండా పోతోంది.

గదిలో పడుకుని ఆలోచన మునిగిన నేను అమ్మమ్మ కాఫీ కప్పుతో లోపలికి రావటం గమనించనేలేదు. ''ఏం అమ్మాయ్, పడుకున్నావు? వంట్లో బాగులేనట్టుంది! అదుగో మొహం చూస్తే తెలుస్తూనే వుంది. త్వరగా వచ్చావుగా, డాక్టరు దగ్గరికి వెళ్దాం పద! ఈరోజు ఆఫీసుకి వెళ్ళవద్దని చెప్తే విన్నావు కాదు''

కాఫీ కప్పు అందుకుంటూ, ''అమ్మమ్మా, వంట్లో బాగాలేదని వచ్చేసిన మాట నిజమేగాని మళ్ళీ బస్సులెక్కి

# నాది అత్యాశ కాదు!

నాకిప్పుడు
అలవాటైపోయింది
అమ్మాయిలమీద యాసిడ్ దాడులు
అబ్బాయిల గృహహింసలు
రాత్రికి రాత్రి
చీట్‌కంపెనీ బోర్డు తిప్పేయడాలూ
నాకు అలవాటైపోయాయి
నకిలీ మందుతాగి చావడం
నకిలీనోటు ఎ.టి.యంలో రావడం
తలిదండ్రులను వృద్ధాశ్రమంలో పడేయడం
నాకిప్పుడు అలవాటైపోయింది
డిగ్రీలు కొనుక్కోవడం
కిడ్నీలు అమ్ముకోవడం
దుబాయ్‌కి సాగనంపడం
హత్యచేసి రక్తం తుడిచేయడం
బల్లకింద చేతులు పెట్టడం
సిమెంటులో ఇసక కలపడం
రాజకీయాల్లో నటించడం
భరతనాట్యమొస్తే ఛానెల్ తిప్పేయడం
అపాయం జరిగితే తప్పుకొని పోవడం
నాకు అలవాటైపోయింది
బస్సులో కుక్కుకుపోవడం
జేబుకత్తిరిస్తే తిట్టేయడం
ముసలితాత జారిపడితే కిసుక్కుమనడం
చెట్లను నరికేయడం
పక్షుల్ని వేటాడడం
నీరుని అమ్మేసుకోవడం
దొరికిందంతా మింగేయడం
దైవదర్శనానికి అడ్డదార్లు వెతకడం
నాకిప్పుడు అలవాటైపోయింది!

* * *

నా సమాజానికి
జీన్ థెరపీ చెయ్యాలి
నాతోనే ఆరంభం కావాలి!!

జి.వి.ఎస్.ప్రియంవద

ఆ డాక్టరు దగ్గరకి వెళ్ళటం మాత్రం నావల్ల కాదు. దగ్గరలో ఎవరు లేరా? అయినా, మీ ఇద్దరు అంత పెద్దవాళ్ళయి వుండి ఫ్యామిలీ డాక్టరు మరీ అంత దూరమేమిటసలు అవసరం వస్తే పరిగెత్తాలంటే ఎంత కష్టం! తగ్గకపోతే రేపు చూద్దాంలే!''

''నీ మొహంలా వుంది. చూడు ఎలా వేలాడిపోతున్నావో, రెండిళ్ళవతల ఒక డాక్టరు ఉన్నాడులే రా! అక్కడికి వెళ్దాం అంతగా నువ్వు బస్సు ఎక్కే ఓపికలేదంటే!''

''ఓపిక లేకకాదులే! నీకర్థం కాదులే అమ్మమ్మా. బయటికి వెళ్ళాల్సివస్తే కష్టం ఉద్యోగం చెయ్యటంలో లేదు. చెయ్యటానికి వెళ్ళటంలో వుంది. బయటకి వెళ్ళాల్సి వచ్చినప్పుడల్లా మాధవ్ స్కూటర్లో తీసుకు వెళ్ళేవాడు. అందుకే కొన్ని కష్టాలుంటాయని నాకిన్నాళ్ళూ తెలీనే తెలియదు. స్కూలుకి నడిచే వెళ్ళేదాన్ని కదా! అంతకు ముందు కాలేజీకి వెళ్ళే రోజుల్లో నాన్నగారు రోజు కార్లో దింపేవారు. పద వెళ్దాం!''

డాక్టరు ఇచ్చిన మందులు కొనుక్కుని ఇంటికి వచ్చేశారు ఇద్దరు. అలసట, సమయానికి తిండి, నిద్ర లేకపోవటం తప్పితే మరే జబ్బూ లేదని సక్రమంగా తిని రోజుకి ఆరుగంటలన్నా నిద్రవుండేటట్టు చూసుకోమని చెప్పాడు కూడా.

మర్నాడు లేచి టుటోరియల్ కాలేజికి బయలుదేరుతుంటే అమ్మమ్మ ఆపింది. నవ్వుతూ ఏమిటో చేతిలో పెట్టింది. ''ఏమిటి అమ్మమ్మా?'' అర్థంకాక అడిగాను.

''బస్సులో ఎవరైనా విసిగించారనుకో నీ ఆయుధం అనుకో ఇది. ప్రయోగించి చూడు. కర్ర విరగదు, పాము చావదు. కుక్కిన పేనుల్లా నిన్ను విసిగించేవాళ్ళు నీ దారి నుంచి తప్పుకుంటారు''

''అది సరే నీకెవరు చెప్పారు నన్నెవడో విసిగిస్తున్నాడని. ఈ ఆయుధం ఏమిటి నేనెప్పుడూ వినలేదే?''

''అవన్నీ తర్వాత రాత్రి నువ్వొచ్చాక మాట్లాడుకుందాములే. ముందు కాలేజికి వెళ్ళు'' అమ్మమ్మ వంటింట్లోకి నడిచింది హడావిడిగా, తాతయ్య అన్నానికి కూర్చున్నారంటూ.

ఆరోజూ షరా మామూలే. వాడి చెయ్యి తనమీద పడింది. మరుక్షణం వాడి కళ్ళు ఆశ్చర్యంతో, బాధతో విచ్చుకున్నాయి. బెల్లంకొట్టిన రాయిలా ఒకడుగు వెనక్కి వేశాడు. నాకేసి అర్థం కానట్టు చూడడం నాకు తెలుస్తూనే వుంది. నాకేమీ పట్టనట్టు నుంచుని కిటికీలోంచి బయటికి చూడడం సాగించాను.

మళ్ళీ అయిదు నిమిషాల తర్వాత ఇంకో ప్రయత్నం

చేద్దామని ముందడుగు వేశాడో, లేదో ఎల్క్ట్రిక్ షాక్ కొట్టిన వాడిలా గబుక్కున వెనకడుగువెయ్యడమే కాదు నాకు దూరంగా జరుగుతూ తర్వాత స్టాపులో బస్సు దిగి పోయాడు. దిగాక అతను చూసిన చూపే కాదు ఈ ఆత్మ సంరక్షణ పాఠం కూడా జీవితాంతం గుర్తుంచుకోవా ల్సిందే అనుకున్నాను. 'అమ్మో, అమ్మమ్మా, ఏమో అను కున్నాను నువ్వు తర్వాత యుగానికి చెందిన దానివి సుమా!' అనుకుంటూ తనిచ్చిన సేఫ్టీ పిన్ బ్యాగ్‌లో భద్రంగా దాచుకున్నాను.

మర్నాడు పొద్దున్న అమ్మమ్మతో చెపితే "నువ్వన్నావు కదా ఒకసారి కాలేజి నుంచి ఇంటికి బస్సులో రావల్సి వచ్చి ఎవడో విసిగించాడని చెంప పగలగొడితే, మీ నాన్న అల్లరిపడ్డావని నిన్నే తిట్టారని అందుకే ఆ తర్వాత నిన్ను బాడీగార్డులా రోజూ కాలేజీకి దింపేవారని మనకి జీవి తాంతం ఎవరు బాడీగార్డుల్లా వుండగలరు చెప్పు? మనల్ని మనమే తెలివిగా కాపాడుకోవాలంతే. అందుకే నీకీ మంత్రదండం ఇచ్చాననుకో!

❖ ❖ ❖

మాష్టారు, మాధవః

ఆరోజు ఆదివారం కావటంతో నేను మాష్టారు ఇద్దరం ఏడు గంటల దాకా పడుకున్నాము. లేచి కాఫీ తాగాక మాష్టారు "ఈరోజు నీ ప్రొగ్రామ్ ఏమిటీ?" అంటూ సంభాషణకి శ్రీకారం చుట్టారు.

"ఏముంది? ఆదివారం కదా! క్షవరం చేయించుకొద్దా మనుకుంటున్నాను. ఆతర్వాత ఖాళీయే మీకేమన్నా పనుందా?"

"అదే ఆదివారమనే కొంతమంది స్నేహితులు భోజ నానికి వస్తామన్నారు. వాళ్ళందరూ నేను చేసిన పులిహోర అంటే పడిచస్తారు. అందుకని పులిహోర చేసేద్దామను కుంటున్నాను. ముందుగానే చేసేస్తే బాగా ఊరుతుంది. కదా!"

"మాష్టారు! పులిహోరా? కష్టంకదా చెయ్యటం. మీరివన్నీ చెయ్యటం ఎక్కడ, ఎలా నేర్చుకున్నారు?"

"ఏముంది? అవసరం అన్నీ అదే నేర్పిస్తుంది. పెళ్ళైన కొత్తల్లో నేను కూడా అందరి మగాళ్ళలా కాఫీ చెయ్యటం కూడా రాకుండా వంటింట్లోకి వెళ్ళే అవసరం మగాళ్ళ కేమిటి అనుకుంటూ గడిపేసిన వాడినే! అయితే జీవితం అన్ని పాఠాల్ని నేర్పించింది. అన్నీ నేర్చుకున్నాను ఎవరి సహాయం లేకుండా బ్రతకటంతో సహా! రోజూ హోటల్లో తినటం ఎంత విసుగో తినేవాళ్ళకే తెలుస్తుందనుకో!"

మాష్టారు అవటానికైతే చిన్నప్పుడు పాఠాలు చెప్పిన పంతులు అన్నమాటే గాని మా ఇద్దరి మధ్య దాన్ని మించిన అనుబంధముంది కాబట్టే చనువుగా నాకు సుజాకి మాటా మాటా వచ్చి ఇంక మా బంధానికి భవి ష్యత్తు లేదనిపించినప్పుడు ఇక్కడికి రావటానికి ఆలో చించనవసరం లేకపోయింది. అయితే మాష్టారి జీవి తంలో వచ్చిన పడిదుడుకుల గురించి ఆయన్ని అడగటా నికి ఎప్పుడూ సాహసించలేదు.

ప్రేమించి కుటుంబ సభ్యుల ఇష్టాలకి వ్యతిరేకంగా కులాంతర వివాహం చేసుకున్నారు. అంతగా ప్రేమించిన భార్య పెళ్ళయిన రెండేళ్ళకే బ్రెయిన్ ట్యూమర్‌తో కాలధర్మం చేసింది. ఆమె అవసానదశలో చంటి పిల్లని సాకినట్టు సాకేవారని ఆ టైములోనే వంటలో ప్రావిణ్యాన్ని సంపా దించారని ఆయనే ఒకసారి మాటల సందర్భంగా చెప్పారు తప్ప నేనెప్పుడు అడగలేదు. అయితే భార్యాభర్త లిద్దర్నీ కలిపింది కేవలం యుక్తవయస్సు ప్రేమే కాదని ఆయనలో అరుదుగా వున్న విశాలదృక్పథమేననడంలో సందేహంలేదు.

అవకాశమొచ్చినప్పుడల్లా ఆయన నాకు ఆడపని మగపని అని విడివిడిగా వుండవని కావాలనుకుంటే అన్ని పనులు అందరూ చెయ్యచ్చని చెపుతూనే వున్నారు. సమాన హక్కులంటూ ఆడ మగా కోర్టులకెక్కే ఈరోజు లలో ఆయన దగ్గర నేర్చుకోవల్సింది చాలా వుంది. నేను బట్టలు ఉతుకుతాను, నువ్వు అంట్లు తోమ అని పంచుకోవటంతోపాటు ఒకళ్ళ పనిలో సాధకబాధకాలు ఇంకొకరు అర్థం చేసుకోగలిగితే సంసారాలు చక్కగా నదిలో హాయిగా చేసే పడవ ప్రయాణాల్లా వుంటాయని నిన్ననే చెప్పారు. ఈ మధ్య మాష్టారు తనకి నెమ్మదిగా బ్రెయిన్ వాష్ చేస్తున్నారా అనిపిస్తోంది.

"సరే మాష్టారూ! ఈరోజు పులిహోర ఎలా చెయ్యాలి అనే విషయంలో మేము పాఠం నేర్చుకోబోతున్నామన్న మాట. ఐ యామ్ రెడీ ఫర్ ద షో!"

"మొట్టమొదట ఆలోచించాల్సిన విషయం అన్నం గురించి. ఎంత పొడపొడలాడితే అంత బాగుంటుంది. మామూలుగా మనం వాడే సన్న బియ్యంగానీ, పర్మల్ బియ్యం గాని వాడవచ్చును. బాసుమతి లాంటి బియ్యం వాడితే అంతగా పులుపు పీల్చవు. ఒకటికి ఒకటి ముప్పావు గ్లాసుల నీళ్ళు పొయ్యాలి. వండటమవగానే ఒక పెద్ద బేసిన్లో గాని వెడల్పాటి పళ్ళెంలోగాని పరిచి చల్లార్చాలి. పదినిమిషాలలో చల్లారి విడివిడిగా పొడపొడలాడుతూ వస్తుంది.

అన్నంపైన ఉప్పు, పసుపు తగినంత వెయ్యాలి.

అరకిలో బియ్యంవేస్తే ఒక యాభైగ్రాములు అంటే చిన్న నిమ్మకాయంత చింతపండు నానబెట్టి చిక్కగా రసం తీసిపెట్టుకోవాలి. ఒక మూకుడులో నూరు గ్రాముల నూనె వేసి కాగాక శనగపప్పు, మినపప్పు, ఆవాలు, జీలకర్ర, ఏడెనిమిది మిరపకాయలు ఇంగువ వేసి పోపు మూడువంతులు వేగాక వేరుశనగపప్పు వేసి అందులోనే సన్నగా తరిగిన అల్లం పొడవుగా చీల్చి వేసిన పచ్చిమిరప కాయలు కరివేపాకు వెయ్యాలి. ఆ తర్వాత ఆ పోపు నూనెలోనే చింతపండు రసం పొయ్యాలి.

బాగా ఉడికాక నూనెలో చింతపండు తేలుతుంది. పరిచిపెట్టిన అన్నంలో పైన నువ్వు పొడి జల్లాలి. కొంచెం నువ్వులనూనె పైన వేస్తే మంచి ఘుమఘుమలాడు తుంది. అప్పుడు పోపు మసాలా అన్నంలో కలుపుకో వాలి. కనీసం మూడు గంటలు నానాక తింటే రుచిగా ఉంటుంది. ఎంత ఊరితే అంత రుచి. మర్నాడు తింటే గూడా బాగుంటుంది. కొంతమంది పులుపు విరగటానికి చిన్న బెల్లం ముక్క వేస్తారు. అయితే చిన్న ముక్క వెయ్యాలి. ఏ మాత్రం ఎక్కువ వేసినా బాగుండదు మరి! అలాగే, చింతపండు బదులు నిమ్మకాయ రసం పిండితే అదే పోపుతో నిమ్మకాయ పులిహోర అవుతుంది. మిగతావన్నీ షరామామూలే!''

ఆ మధ్యాహ్నం అందరితోపాటు మాష్టారి పులిహోర లొట్టలేసుకుంటూ తిన్నాను. అన్నీ సరిగ్గా సరిపోయాయి. పులుపులో ఊరిన మిరపకాయలు అసలు కారమేలేవు. ఎంత తిన్నా తనివితీరలేదు. ''భార్యాభర్తల మధ్య అనుబంధంలా పులిహోర మొదటి ప్రయత్నంలోనే బాగా వస్తే రుచి చాలాకాలం గుర్తుండిపోవటమేకాక, పులిహోర చెయ్యటంగూడా అరచేతిలో బ్రహ్మవిద్య అనిపిస్తుంది. ఎన్నిసార్లు చేసినా అంతే పర్ఫెక్షన్తో వస్తుంది కూడా. మొదటిసారి కుదరలేదా మళ్ళీ ప్రయత్నించాలంటే సందే హించాల్సి వస్తుందికూడా పులిహోరైనా, సంసారమైనా!'' మాష్టారి ఉవాచ.

❖ ❖ ❖

సుజా:

ఆరోజు చాలా సంతోషంగా అనిపించింది, నాకు వచ్చిన రెండు నెలల జీతాన్ని బ్యాంకు అకౌంటు తెరిచి అందులో పడేసాను. జీవితంలో మొదటిసారి స్వంతంగా స్వతంత్రంగా బ్యాంకు అకౌంటు తెరుస్తుంటే చాలా గర్వంగా అనిపించింది. కాల్ సెంటరు జాబ్ అని తను ఎంత బాధపడుతూ పగలు రాత్రిళ్ళూ, రాత్రుళ్ళు పగలుగా చేసి నిజంగా కష్టపడి సంపాదించిన డబ్బాయె మరి! ఎన్ని కష్టాలైనా భరించవచ్చు ఈ మాత్రం సంపాదించగలిగి చదువు పూర్తిచెయ్యగలిగితే తనకి అంతకన్నా కావలసిందేమీ లేదు. రెండేళ్ళలో ఎమ్.ఏ అయిపోతుంది. అప్పుడు తనకి ఇష్టమైన లెక్చరర్ ఉద్యోగం సంపాదించుకోవచ్చు కూడా!

ఆరోజు కాలేజీ చేరుతూనే మంజుల, వాళ్ళన్నయ్యా కనిపించారు. ''ఏమిటి సంగతి, ఈరోజు చాలా సంతోషంగా కనిపిస్తున్నావు? ఇలా నవ్వుతూ ఎప్పుడూ కనిపించవు కదా! ఎప్పుడు చూసినా ప్రపంచ భారాన్నంతా నువ్వే మోస్తున్నట్టు కనిపిస్తావు. ఇకనుంచి ఇలాగే ఉండు ప్లీజ్!''

అందరూకలిసి క్యాంటీన్ కేసి నడిచారు. నేను కాఫీ తాగుతూ వాళ్ళిద్దరికీ ఆరోజు నేను సాధించిన ఘనత గురించి చెప్పాను. దానికోసం నా పూర్వచరిత్ర చెప్పడానికి కూడా సందేహించలేదు. అంతా విని ''అయ్యబాబోయ్! ఏమిటో అనుకున్నాను, ఈ సాధారణంగా, సీదాగా కనిపించే నీకు ఇంత చరిత్ర వుందనే తెలియదు. నార్మల్గా కాలేజీలకి చిన్నపిల్లలు వస్తారు కానీ పెళ్ళయిన వాళ్ళు రావడం తక్కువేననుకో! ఏది ఏమైనా ఇప్పుడు మాకంతా తెలుసు కనుక నీకేరకమైన సహాయం కావల్సినా నిర్మొహమాటంగా చెప్పు'' వాళ్ళన్నయ్య కూడా అంగీకరిస్తున్నట్టు తలూపాడు. అంత సేపట్నుంచి మేమిద్దరం మాట్లాడుతుంటే అతను కేవలం మౌనంగా ప్రేక్షకుడిలా కూర్చున్నాడు. ఆ విషయం నాకు చాలా నచ్చింది కూడా.

మర్నాడు నేను లేచిన కాసేపటికే అమ్మమ్మ గట్టిగా ''అమ్మలూ! నీకోసం ఎవరో వచ్చారు'' పిలవటం వినిపించింది. తనకోసం ఇక్కడికి ఎవరొస్తారు? ఎవరికి తెలుసు తనిక్కడ వున్నట్టు. ముందు గదిలోకి వచ్చాను ఎవరై వుంటారా అనుకుంటూ. మంజుల వాళ్ళన్నయ్య! ఇదేమిటి, ఇక్కడ?

''నమస్కారం సుజాత గారూ! పొద్దున్నే మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యటంలేదుకదా! నాకు తెలుసు మళ్ళీ మీరు కాలేజి వెళ్ళిపోతారని. అందుకే త్వరగా వచ్చాను''

''ఏమిటి సంగతి చెప్పండి'' అన్నాను త్వరగా రెడీ అవ్వాలని అనిపిస్తున్నా మర్యాదగా వుండదు కదా ఆ విషయం పైకి అంటే అనుకుంటూ! ఇలాంటి విషయాల్లో మాధవ్ ఎంత కచ్చితంగా వుంటాడో గుర్తొచ్చింది. ఆఫీస్ కెళ్ళేముందు ఎవరొచ్చినా నన్ను వాళ్ళతో మాట్లాడమని తోసేసి తను ఆఫీసకి పరిగెత్తేసేవాడు. ఇప్పుడు తను అలా చెయ్యలేదు కదా!

''ఏం లేదు. ఈమధ్య ఒక్క జీతం ఏం గడుస్తుందిలే అని కొన్ని ఇన్వెస్ట్మెంట్స్కి ఏజన్సీ తీసుకున్నాను. నిన్న

మీరు ఏదో అన్నారు కదా బ్యాంకు అకౌంట్ తెరిచానని. మీచేత కొన్ని సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ చేయిద్దామని వచ్చాను''

''వీటి గురించి నాకంతగా తెలియదండీ! తీరా ఎందులోనన్నా పెడితే అది కాస్తా దివాళా తీసిందనుకోండి, నాలాంటి వాళ్ళు కూడదీసుకోలేరు కూడా! అందుకే ఏ రిస్క్యూ లేకుండా బ్యాంకు డిపాజిట్ వేద్దామనుకుంటున్నాను'' అన్నాను.

''ఆ పని మాత్రం చెయ్యకండి. మీకు తెలియదు. ఈ రోజుల్లో బ్యాంకు డిపాజిట్లకి అసలు విలువ జీరో. అసలుకి తప్పితే మనకి వచ్చే లాభం ఏమీ వుండదు. మీకు ఏమీ భయం లేకుండా సేఫ్‌గా వుండే ఇన్వెస్ట్‌మెంట్స్ చెపుతాను. గ్యారంటీగా మీ పైసల విలువ రెండు మూడింతలు అవుతుంది. అప్పుడు మీరేవచ్చి నాకు థ్యాంక్స్ చెపుతారు'' పక్కా వ్యాపారస్తుడి లా మాట్లాడేస్తుంటే ఏం సమాధానం చెప్పాలో తెలియక దిక్కులు చూడడం మొదలుపెట్టింది.

అతను మాట్లాడటం ఆపగానే ''మీరు చెప్పింది నిజమే! నేను ఆలోచించుకుని మీకు చెపుతాను'' అప్పటికి తప్పించుకుంది. అతను కూడా వేరే బాధ పెట్టకుండా తన ఫోను నెంబరు ఇచ్చి తప్పకుండా ఇన్వెస్ట్‌మెంట్ చెయ్యమని మరోసారి చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత హడావుడిగా బ్రేక్ ఫాస్ట్ చేసి బయలుదేరావనుకునేలోపు అమ్మమ్మ ''ఏమిటే అమ్మాయి ఆ అబ్బాయి అంటున్నాడు?''

''ఏంలేదు అమ్మమ్మా! మా టుటోరియల్ కాలేజీలో నాతోపాటు చదివే మంజుల వాళ్ళ అన్నయ్య. నిన్న ఏదో మాటల సందర్భంలో రెణ్ణెల్ల జీతం డిపాజిట్ చేశానని చెప్పటం విన్నాడు. ఎక్కడ ఇన్వెస్ట్ చెయ్యాలో చెప్పటానికి వచ్చాడు. నాకైతే ఈ విషయాలసలు అర్థంకావు. ఆలోచించి చెపుతానని చెప్పాను''

''ఆం! వాళ్ళకేవో కమీషన్లుంటాయిట కదా! అందుకే ఇలా వెనకాలే పడి మన డబ్బులు ఎక్కడో అక్కడ పెట్టించేస్తారు. తర్వాత కష్టనష్టాలు మనవి. వాళ్ళు తుపాకి గుండుకి దొరకరు. నష్టం వస్తే మళ్ళీ మనం కూడగట్టుకోలేం. కష్టపడి సంపాదించిన డబ్బులు మనవి. జాగ్రత్తగా వుండమ్మా! తాతయ్యని అడిగి చెయ్యి ఏంచేసినా. మాకెప్పుడూ ఈ కాలం పిల్లలకి వచ్చినట్టు వేలల్లో జీతాలు రాలేదనుకో! అయినా నలుగురుతో మాట్లాడుతూ వుంటారు కదా! విషయాలు వాళ్ళకి తెలుస్తాయి. నీ డబ్బు నీ ఇష్టం అనుకో!''

తనకేం పట్టనట్టు ఆవిడ అలా అన్నా ఆవిడ ఆదుర్దా తనకర్థమయింది. తను కష్టపడి ఒక ప్రయోజనం కోసం కూడపెట్టిన డబ్బులు జాగ్రత్తగా బ్యాంకులో వుంచితేనే మంచిది. మాధవ్ ఇలాంటి విషయాలు ఎప్పుడూ తనతో చర్చించలేదు. పూర్తిగా అంధకారంలో వుంచేశాడు. తర్వాత వచ్చిన జీతం ఇన్వెస్ట్ చేస్తానని చెప్పి ఇప్పటికి తప్పించుకోవటమే ఉత్తమం అనుకుంటూ ఇల్లు వదిలి కాలేజీకి బయలుదేరింది.

❖ ❖ ❖

మాష్టారు, మాధవ:

''మాష్టారూ, పులిహోర నేర్చేసుకున్నాను కదా! ఇంకేమేమి నేర్చుకోవాలి ఆంధ్రా స్పెషల్స్ మీ దగ్గర. జీవితాంతం ఒక్కణ్ణే వుండవలసి వస్తే మీ దగ్గర అయ్యే ట్రైనింగు బాగా పనికి వస్తుంది'' మర్నాడు పొద్దున్న మాష్టార్ని మాటలలో పెడుతూ అన్నాను.

''నేర్చుకోదల్చుకుంటే ఎన్నయినా వున్నాయి కానీ, నువ్వు జీవితాంతం ఒక్కడివీ వుండాల్సి వస్తుందని మాత్రం కాదు. అలా అయితే ఈరోజే నిన్నిక్కడినుంచి పంపించేస్తాను''

''అబ్బెబ్బే! అదేంలేదు. సరదాగా అన్నాను. నేను సుజాతో గొడవపడి మీ దగ్గరికి వచ్చినమాట నిజమే గాని జీవితంలో తన మొహం చూడనని ప్రతిజ్ఞ ఏం చెయ్యలేదు లెండి. మా మధ్య వచ్చిన అభిప్రాయభేదాలు సమసిపోతాయనే ఆశతోనే నేనూ బ్రతుకుతున్నాను. ఈ విషయంలో మీరేం భయపడక్కరలేదు'' మాష్టారికి నమ్మకం కలిగించగలిగాననే అనుకున్నాను.

''సరే అయితే నీకేమీ నేర్చుకోవాలని వుందో చెప్పు. నీ ఉద్దేశ్యంలో ఏవి ప్రత్యేకంగా ఆంధ్రా వంటలో చెపితే అవి ప్రయత్నిద్దాం. సరేనా?''

''మా అమ్మ చేసేది గోంగూర పచ్చడనీ, పులుసనీ, కందా బచ్చలి కూర, కూటు వగైరా వగైరా అనుకోండి. కాని ఇవన్నీ చెయ్యాలంటే ఆఫీసుకెళ్ళే వాళ్ళం మనకెక్కడ కుదుర్తుంది మాష్టారూ?''

''సరే, ఒక్క విషయం అడుగుతాను ఏమీ అనుకోకుండా జవాబు చెపుతావు. నీకు ఎన్నో ఏళ్ళ క్రితం అమ్మ చేసిన వంటకాలు గుర్తున్నాయి గాని మొన్న మొన్నటిదాకా నీకు వంట చేసిపెట్టిన భార్య చేతివంట గుర్తుకు రాలేదు ఎందుకంటావు? ఒక్కొక్కసారి చిన్న చిన్న విషయాలలో మన ప్రవర్తన పెద్ద అపార్థాలకి ఎలా దారితీస్తుందో చిన్న ఆలోచన, చిన్న ప్రశంస మన మనఃక్లేశాలని దూరం చేసి జీవితాల్ని పూర్తిగా మార్చివేస్తుంది గూడా. సరే, నీక్కావాలంటే ఈరోజు సాయంత్రం

గోంగూర పులుసు గురించి చెప్పుకుందాం:

''పులుసా, పచ్చడి కదా ప్రసిద్ధి!''

''ముందు పులుసు. తర్వాత పచ్చడి సంగతి చూద్దాం!''

ఆరోజు సాయంత్రం నేను వచ్చేసరికి మాష్టారు సాయంకాలం కూరల మార్కెట్‌కి వెళ్ళి తాజా గోంగూర తెచ్చి దాన్ని ఓపికగా బాగుచేసి ఉల్లి వెల్లుల్లి తరిగి అన్నీ రెడీగా పెట్టారు. నేను వెళ్ళగానే టీ టిఫిను కానిచ్చాక మేమిద్దరం వంటింట్లో రంగప్రవేశం చేశాము.

''మొదటగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే గోంగూర అవడానికి చాలా చవకగా దొరుకుతుంది. కానీ ఇందులో పడే ప్రతి సామాగ్రి తక్కిన వంటకాల్లో కాకుండా కొంచెం ఎక్కువ పాళ్ళలోనే పడతాయి. నూనెతో మొదలెడదాం.

నూనె, మిరపకాయలు, ఇంగువ, మెంతిపొడి అన్నీ శాస్త్రోక్తంగా దండిగా పడాల్సిందే! మొదట నూనె పోయకుండా, పొడి మూకుట్లో మెంతులు ఆవాలు ఎర్రగా వేయించి పెట్టుకోవాలి. తర్వాత అదే మూకుట్లో కొంచెం నూనె వేసి గోంగూర బాగా దగ్గరపడి సగంకంటే తక్కువయ్యేదాకా వేయించాలి.తగినంత ఉప్పు,కొంచెం పసుపు కూడా ఇప్పుడే వేసెయ్యాలి. తర్వాత కొంచెం ఎక్కువగా వేసిన నూనెలో పోపు సామాగ్రి అంటే, మినపప్పు, దండిగా మిరపకాయలు ఆవాలు అరస్పూన్ జీలకర్ర, అరస్పూన్ ఇంగువ వేసి సన్నగా తరిగిన ఉల్లి పాయలు, వెల్లుల్లి వేసి వేగాక వేయించిన గోంగూర కలపాలి.

అన్నీ బాగా కలిసి వేగాకా చివర్లో కొంచెం శనగపిండి చల్లటి నీళ్ళలో కలిపి ఈ పులుసులో కలపాలి. చివర్లో స్టౌవ్ కట్టేశాక మెంతిపొడి కలపాలి, కావాలనుకుంటే కొంచెం నువ్వు పొడి కూడా కలుపకోవచ్చు. మన గోంగూర పులుసు తయారు. ఇదే పచ్చడనుకో అసలు తడి తగలకుండా చెయ్యాలి. ఉప్పు వేసి వేయించిన గోంగూర పక్కన పెట్టి, మూకుట్లో ఆవాలు మెంతులు మిరపకాయలు ఇంగువ బాగా నూనెలో వేయించి తీసి పెట్టాలి. ఈ పోపు సామాగ్రి పొడి చేసుకోవాలి. అందులోనే బాగా వేగిన గోంగూర కూడా కలిపి మిక్సీలో తిప్పాలి. శనగపిండి నీళ్ళలో కలిపి వేయనక్కరలేదు. ఉల్లి వెల్లుల్లి కూడా వేయనక్కరలేదు. చివర్లో దండిగా వేసిన నూనెలో ఇంగువ ఆవాలు వేసి చిటపటలాడాక పచ్చడిలో కలపాలి. ఇది చాలారోజులు నిలవుంటుంది తడి చెంచా కూడా పెట్టకుండా కాపాడుకోవాలంతే!''

''సరే! పచ్చడి, పులుసు రెండు నేర్పేశారు. ఒకే దెబ్బకి రెండు పిట్టలన్నమాట. అయితే ఇవన్నీ మీరు చేసినట్టు నేను చేయగలనన్న గ్యారంటీ ఏమీలేదు. అంత ఓపికా ఇంట్రస్టూ రెండూ లేవని నా అభిప్రాయం''

''అందరికి ఇంట్రస్టు వుండాలని రూలేమీ లేదు. కానీ ఎవరైనా మనకోసం ఇవన్నీ చేస్తే కాస్తంత గుర్తింపు మెచ్చుకోలు వుండడం అత్యవసరం'' మాష్టారు చెప్పకనే చాలా విషయాలు చెప్తేస్తారు. ఎప్పుడూ హడావుడిగా తిండి తినేసి ఒక్కరోజుకూడా ఏ కాంప్లిమెంటూ ఇవ్వకుండా ఇస్తే ఎక్కడ అలుసు అయిపోతానో అన్నట్టు ప్రవర్తించిన నా పద్ధతి నాకే సిగ్గనిపిస్తోంది ఇప్పుడు.

''ఎలా వచ్చింది?'' ఆతృతగా సుజా అడిగితే నీ మొహంలా వుందనో, సర్లే బాగానే వుందనో కొట్టిపడేసిన రోజులు కోకొల్లలు.

❖ ❖ ❖

సుజా, అమ్మమ్మ, తాతయ్య

ఆఫీసులో అడుగుపెడుతూనే అర్థమయింది ఈరోజు నాకు అక్షింతలు పడడం తథ్యమని. మళ్ళీ లేటు నేను. టుటోరియల్ కాలేజీలో ఈరోజు నుంచీ పరీక్షలు. ఇవ్వాళే కాదు వచ్చే పది రోజులదాకా నాకు ఆఫీసు టైముకి రావడం కుదరదు. అయితే ఆఫీసు చేరి అన్ని రోజులు కాలేదు సెలవు పెట్టడానికి.ఎలాగో అలా బాసుని ఒప్పించి ఈ పదిరోజులు లేటుగా రావటానికి పర్మిషన్ అడిగితే సరిపోతుంది. అయితే ఈ వాతావరణంలో వేడి చెప్పకనే చెప్పింది నా ప్లాను ఫలించే అవకాశాలు తక్కువని.

సరే, ఎలాగో అనుకున్నాను కదా ప్రయత్నించి చూడటమే మేలని వెళ్తూనే బాస్ రూమ్‌వేపుకి నడిచాను.

''ఓహో, మహారాణిగారికివ్వాళ లేటుగా తెల్లవారింది కాబోలు'' అన్న వ్యాఖ్యని వింటూనే చటుక్కున వెనక్కి తిరిగి చూశాను. ఎవరామాట అన్నారో కూడా తెలియకుండా అందరూ నిశ్శబ్దంగా తలలువంచి పనిలో లగ్నమైనట్టు నటించటం మొదలుపెట్టారు. చేసేదేమీలేక మారు మాట్లాడకుండా బాస్ రూములో అడుగుపెట్టాను.

''రండి సుజాత గారూ, మీకోసమే చూస్తున్నాను''

''సారీ సర్, నాకు రావటం లేట్ అయింది. నేను పొద్దున్న టైములో ఖాళీకదా అని టుటోరియల్ కాలేజీలో చేరాను. ఎమ్.ఎకి కట్టాను. కొన్నాళ్ళు కష్టపడితే డిగ్రీ చేతికొస్తుంది.ఎందుకైనా పనికొస్తుందని ఆశ. దయచేసి మీరు నాకీ అవకాశమిప్పిస్తే మీకు చాలా ఋణపడివుంటాను. మీకు తెలియనిదేముంది. ఈరోజుల్లో వుట్టి గ్రాడ్యుయేట్ డిగ్రీ టంగ్ క్లీనర్‌తో సమానమనీ క్వాలిఫికేషన్ ఇంప్రూవ్ చేసుకుంటే భవిష్యత్తు బాగుంటుందని మా తాతగారు

బలవంతంగా కట్టించారు. మామూలు రోజుల్లో పర్లేదు, ఈ పరీక్షల పదిరోజులూ లేటుగా రావటానికి పర్మిషనిస్తే చాలు. తర్వాత ఏ ప్రాబ్లమూ వుండదు''

కాసేపు రూములో నిశ్శబ్దం తాండవమాడింది.

''చూడమ్మా! నేను నీ చదువుకి శత్రువుని కాదు. కానీ ఈ ఆఫీసుకి బాసుని. నాకు నువ్వనుకున్నంత స్వతంత్రం లేదు ఇప్పుడు నువ్వంటున్నావే కేవలం పదిరోజుల కోసంనీకీ పర్మిషను కావాలని. గత పదిరోజులుగా చూస్తున్నాను. పరీక్షల ఆదుర్దా టెన్షన్ నీ ముఖంలో కొట్టవచ్చినట్టు కనిపిస్తూనే వుంది. దీని ఎఫెక్ట్ నీ పనిమీద పడకుండా వుండదు కదా! ఎంతైనా చాలారోజుల తర్వాత ఈ చదువు, పరీక్షల ఝంఝాటంలో పడటం సాహసమే కాదు కష్టమైన పని కూడా. నీకంతగా చదువుకోవాలని వుంటే తప్పక చదువుకో! నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తాను. ఆశీర్వదిస్తాను కూడా. కానీ ఈ ఆఫీసులో పని చేస్తూ కాదు. ఇక్కడ పని వదిలేసి పూర్తిగా చదువుమీద ధ్యాస పెడితే చక్కగా మంచి రిజల్ట్‌తో పాసవగలవు కూడా!''

కర్ర విరగకుండా పాము చావకుండా చెప్పాడు, ఉద్యోగం కావాలనుకుంటే చదువు మర్చిపోవాలి. చదువు కావాలనుకుంటే ఈ ఉద్యోగం వదులుకోవాలే తప్ప మరో దారి లేదని... నిరుత్సాహంగా నిస్త్రాణగా లేచి నా టేబిల్ దగ్గరికి నడిచాను.

''ఈ కాలంలో ఆడపిల్లలకి ఆశ లావు పీక సన్నం అంటారే ఆ మోస్తరు. చదువులు స్వాతంత్ర్యాలు కావాలి, ఉద్యోగాలూ సంపాదనలూ కావాలి. మళ్ళీ మొగుడూ, పిల్లలూ, సంసారమూ కావాలి. అటూ ఇటూ సర్దుకునే నైపుణ్యము ఉన్నవాళ్ళకే గాని ప్రతివాళ్ళకీ మెరిట్లో అంతా ఒక్కటే అని ఉద్యోగమిస్తే తర్వాత ఇలాగే ఏడవాలి ఏ బాసైనా, ఇప్పటికైనా ఈవిడగారు మొగుణ్ణొదిలేసి సాధించాలనుకున్న విజయాల గురించి ఎవరైనా బాసుకి చెపితే సరిపోతుంది కదా! ఎర్రగా, బుర్రగా వుంది కదాని ఉద్యోగాలిస్తే ఇలాగే తగలడతాయని ఆయనకీ తెలిసొస్తుంది''

రాజారామ్ చేస్తున్న అనర్గళ ఉపన్యాసానికి మండిపోతున్నా జవాబివ్వటానికి ఓపిక, ఆసక్తి లేక నిశ్శబ్దంగా రాజీనామా ఇచ్చి బయటికి నడిచాను. మనసులో ఒకటే ముల్లు గుచ్చుకున్నట్టు ఆఫీసులో సంభాషణ రాజీనామా ఇవ్వటంకంటే ఎక్కువ సలుపుతోంది.

''అప్పుడే వచ్చేశావేమిటమ్మాయి ఈరోజు?'' అమ్మమ్మ అడుగుతుంటే విననట్టే గదిలోకిపోయి తలుపేసుకుని పడుకున్నాను. గొప్ప అహంకారం అని అందరూ అనుకునే నా ఆత్మవిశ్వాసమనే బెలూన్‌కి చిల్లు పడ్డట్టయింది. ఆలోచనలతో తల బద్దలవుతున్నట్టనిపించింది. అలాగే లేవకుండా రాత్రి దాకా పడుకుండిపోయాను.

తాతయ్యగారు గుమ్మంలో అడుగుపెట్టగానే అమ్మమ్మ ఆదుర్దాగా ''అమ్మాయికి మళ్ళీ జ్వరమొచ్చినట్టుందండీ! లేవకుండా పడిపోయింది వెళ్ళి చూడండి. డాక్టరు పిలుచుకురావాలేమో మరి! ఏం ఉద్యోగాలో ఏం చదువులో పిల్లని మళ్ళీ క్షేమంగా సంతోషంగా చూస్తామా అనిపిస్తోంది? ఆవిడ కంఠంలో వ్యథ నాకు తప్పు చేశానా ఇక్కడికి వచ్చి అని గిల్టీగా అనిపించింది. వీళ్ళకి కష్టంతప్ప ఏ ఒక్కరోజైనా నిశ్చింతగా పడుకునే అవకాశమేలేకుండా చేశాను పెద్దవాళ్ళని కూడా ఆలోచించలేదు నేను.

తాతయ్య లోపలికి వచ్చి వళ్ళు ముట్టుకు చూస్తుంటే కళ్ళు తెరిచి ''ఏంలేదులెండి తాతయ్యగారూ! కాస్త తల నెప్పిగా వుంటేనూ...'' నేను చెప్పబోతుంటే తాతయ్య అడ్డుపడి ''నాకంతా తెలిసిందమ్మా!'' ఎలా తెలిసింది ప్రశ్నార్థకంగా చూడబోయింది. ''మీ బాసు నాకు ఫోను చేసి చెప్పాడు. చాలా బాధపడ్డాడు. ఎవరో హెడ్డాఫీసుకి ఫిర్యాదు చేశారట. చేసేది లేక నిన్ను తొలగిపొమ్మని చెప్పాల్సి వచ్చిందట''

మర్నాడు ఓపికలేకపోయినా ఇంట్లో వుండి చేసేదేమీ లేదు కదా అని ఏదో తిన్నాననిపించి అమ్మమ్మ ఏదో అంటుంటే పూర్తిగా వినకుండా ''ఇవాళ సాయంత్రం వచ్చాక నీతో చాలాసేపు మాట్లాడాలి అమ్మమ్మా'' అంటూ బయటికి నడిచాను.

టుటోరియల్ కాలేజీకి వచ్చానే కానీ తలతిరుగుతున్నట్టనిపించి అక్కడే టేబిల్‌మీద తలపెట్టుకుని కళ్ళు మూసుకున్నాను.

❖ ❖ ❖

మాధవః

''మాధవ్ గారూ! ఫోన్ మీకు''

చూస్తున్న ఫైలును పక్కన పెట్టి ఫోను దగ్గరికి నడిచాను. అవతల వాళ్ళు చెప్పింది విన్నాక తలతిరిగినట్టైంది. వెంటనే ఆరోజుకి సెలవు పెట్టి బయటికి నడుస్తూ తాతయ్యగారికి ఫోను చేశాను. మేమిద్దరం సుజా వాళ్ళ కాలేజీకి వెళ్ళేటప్పటికి వాళ్ళు తనని అప్పటికే పక్కనే వున్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కి షిఫ్ట్ చేశారని తెలిసి అక్కడికి చేరామిద్దరము. డాక్టరు దగ్గరికి వెళ్ళగానే ఆయన ''ఆవిడ పర్సులో మీ విజిటింగ్ కార్డ్ దొరికితే కాలేజీవాళ్ళు మీకు చేశారు. ఈమెవీరి మనవరాలని నాకు తెలుసు'' అని

నాతో చెప్పి తాతయ్యగారి వైపు తిరిగి ''ఏమిటో నీరసం తప్పితే మరేమీ కారణం అనిపించటం లేదు పంతులు గారూ! ఏదా బాధలో వుందా అని అడగడం అసందర్భం అనుకోండి. కానీ కొంచెం విశ్రాంతి మాత్రం తీసుకోవాలి తప్పదు''

తాతయ్య సరే సరే అని తలూపుతుంటే, బయటికి సుజాని పడుకోబెట్టిన రూములోకి నడిచాను. 'ఎలా వుండే మనిషి ఎలా అయిపోయింది. దీనికి నేను బాధ్యుణ్ణా?' సుజాకేసి చూస్తూ నిలబడ్డ నా దగ్గరికి తాతయ్య వచ్చారు.

అలాగే ఏదో సందేహిస్తూ నిలబడ్డ తాతయ్యగార్ని చూస్తే అనకుండా వుండలేకపోయాను. ''తాతయ్య గారూ! నేను తప్పు చెయ్యలేదని నేననను. కానీ ఏ తప్పు చేశారని మావల్ల మీకీ బాధ అని నాకు అనిపిస్తోంది. మీరు అనుమతిస్తే సుజాని తెలివి వచ్చాక నాతో తీసు కెళ్తాను. ఈ సమస్యని మాకు మేము సృష్టించుకున్నాము. పరిష్కారం వెతికే అవకాశాన్ని మాకే ఇవ్వండి. ఈసారి మీకు ప్రమాణం చేసి చెపుతున్నాను. మళ్ళీ సుజా ఇలా మీ దగ్గరికే కాదు ఇంకెవి దగ్గరికి వెళ్ళే అవకాశం ఇవ్వను. తనకి చెప్పి ఒప్పించలేకపోయానన్నమాటేగాని సుజా ఇంటి నుండి వెళ్ళాక నేను హాయిగా ఒక్కరోజు గూడా పడుకోలేదు''

తాతయ్య ''నాకు తెలుసు బాబూ! మనం ఆత్మాభి మానం ముఖ్యమనుకుని నిరాకరించిన అవకాశాలు ఎలా మన చిన్న మనస్తత్వాల్ని బయటికి తెస్తాయో చాలసార్లు గమనించాము. గమనించేసరికి చాలా లేటు అవుతుంది. మీ విషంలో మరీ లేటవకుండానే అన్నీ సర్దుకుంటాయనే ఇన్నాళ్ళూ నేను కల్పించుకోలేదు. అమ్మాయిని నీతో తీసుకెళ్తే నాకేమీ అభ్యంతరమూ లేదు కానీ రేపు అమ్మాయి దొరికిందే చాన్సని తాతయ్య నన్నొదిలించు కున్నాడని అనుకోకూడదు కదా! అందుకే రేపు సాయం త్రం రా! అప్పటికి అమ్మాయితో మాట్లాడి వీలుంటే వప్పించి తన ఇష్టప్రకారం చెయ్యటంమంచిదని నా ఉద్దేశ్యం. ఏమంటావు?''

ఇక అనేదేముంది. మాష్టారికి కూడా జరిగిన విషయాలు చెప్పాలి కదా అనుకుని సుజాకి తెలివి రాకుండా అక్కడనుంచి తప్పుకున్నాను. మళ్ళీ తనెక్కడ బాధపడుతుందోనని సుజాతో మాట్లాడకుండానే బయటికి వచ్చేశాను.

దారంతా మా ఇద్దరి గురించే ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాను. మాష్టారు నన్ను చూస్తూనే ''ఏమిటి విశేషం? ఇవ్వాళ నీ ముఖంలో ఏదో తర్జన భర్జన కనపడు తున్నట్టనిపిస్తోంది. ఏం వంటకం నేర్చుకోవాలనేనా నీ సంకటం. ఫర్లేదులే! నేర్చుకున్నవన్నీ బాగా ప్రాక్టీసు చెయ్యి. అప్పుడు చెపుతాను''

''కాదులెండి మాష్టారూ'' అంటూ కూర్చోపెట్టి విషయమంతా చెప్పాను. సుజాని నాతో మా ఇంటికి తీసుకెళ్తానన్న నా అభిప్రాయం వినగానే ఆయన దిగ్గున లేచి నన్ను లేవదీసి గట్టిగా కౌగలించుకున్నారు.

''నాకు తెలుసు నేనెరిగిన దాదాపు నేను పెంచి పెద్ద చేసిన మాధవ్ దుర్మార్గుడు కాదు. ఒక్కడే పెరగటం వలన అవతలమనిషిని గురించి ఆలోచించాల్సిన అవస రాన్ని గుర్తించటంలేదని అర్థమయింది''

ఆయన దగ్గర వంట పేరుతో నేను నేర్చుకున్నవన్నీ ఈ అవసరాన్ని నేను గుర్తించేలా చెయ్యాలన్న తాపత్రయ మనీ నాకు తెలుసు. ఇంక సుజాకి ఎలా నమ్మకం కలిగిం చాలో ఆలోచించాల్సిందే మరి! భోజనం అయిందని ఎంచి నడుం వాల్చాను పక్కమీద. క్రితంసారి సుజాకి వంట్లో బాగులేనప్పుడు డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళి తర్వాత తనని ఇంట్లో దింపి తన డ్యూటీ అయిపోయినట్టు హడావుడిగా ఆఫీసుకి పరిగెడ్తుంటే చిన్నబోయిన ముఖంతో భార్య చూసిన చూపు ఇప్పుడు ముల్లులా గుచ్చుకున్నట్టైంది. తనకి తలనొప్పి వచ్చినా సుజా పడే తపనలో తను పొందే ఓదార్పు కూడా గుర్తొచ్చింది. ఆలోచనలలో పడుకునేటప్పటికి టైమెంతయిందో కూడా తెలియదు.

❖ ❖ ❖

సుజా, మాధవ్:

మర్నాడు ఆఫీస్‌లో పనిలో మనస్సు లగ్నమవటం లేదని ఒకటికి రెండుసార్లు కాఫీలు తాగి అతి కష్టంమీద సాయంత్రం అవగానే తాతయ్య గారింటికి బయలుదేరి వెళ్ళాడు మాధవ. అప్పటికప్పుడే స్నేహితుడి దగ్గరికి వెళ్ళి అతను చాలా రోజులక్రితం చెప్పిన ఆర్డర్ తీసుకుని బయలుదేరాడు. అతను వెళ్ళేటప్పటికి సుజాత తాత య్యతో మాట్లాడుతూ వరండాలోనే దర్శనమిచ్చింది. ఆమెముఖంమీద ఒక చిన్న చిరునవ్వు కనిపించిందా లేదా అనిపించేంతగా ఒక సెకండ్ అలా మెరిసి మాయ మయ్యింది. అతన్ని చూస్తూనే లేచి లోపలికి నడిచింది.

ప్రశ్నార్థకంగా తాతయ్య ముఖంలోకి చూశాడు. ''కూర్చోవోయ్'' అంటూ కుర్చీ ముందుకు తోశారు.

''ఏమంటుంది సుజా మీరేమన్నా అడిగారా?'' ఆత్ర తగా అడిగాను.

''అనడానికేముంది, ముసలాళ్ళమైన మా దగ్గర వుండడం న్యాయం కాదని అంది కాని తనకి ఇంకో ఛాయిస్ లేదుకనకే వప్పుకుంటుందని అనుకుంటు న్నాను. నువ్వు కూడా మాట్లాడి చూడు. నీమీద తనకి పూర్వపు విశ్వాసం కలగాలంటే ఏం చెయ్యాలో నువ్వే ఆలోచించాలి'' తాతయ్య మనస్సులో సందేహాలన్నీ ఆయన గొంతులో ప్రతిఫలిస్తున్నాయి.

''తనని పిలుస్తారా, నేను మాట్లాడతాను. కనీసం ప్రయత్నిస్తాను'' అన్నాను.

కాఫీతో సుజా అడుగుపెట్టింది. నిశ్శబ్దంగా మొహ మాటంగా కాఫీ తాగటం ముగించి ''అలా బయటికి వెళ్ళాం వస్తావా సుజా! త్వరగానే వచ్చేద్దాం'' అడిగాను సందేహంగా.

వెంటనే సరేనని చెప్పులు వేసుకుని బయలుదేరింది ఆ అవకాశం కోమే ఎదురుచూసిందా అనిపించేలా. ఇద్దరూ నిశ్శబ్దంగా పార్కుదాకా నడిచారు. చాలాసేపు ఏం మాట్లాడాలో తెలియనట్టే కూర్చున్నారు. నెమ్మదిగా జేబులోంచి ఒక కవరు తీసి తనకి అందిచ్చాడు. తీసుకుని చదివి నిర్ఘాంతపోయినట్టే చూస్తూ వుండిపోయింది.

''ఏమిటి నేను నేనేనా అని ఆలోచిస్తున్నావా? నువ్వు వెళ్ళిపోయిన తర్వాత ఈ నాలుగు నెలల్లో నాకొక విష యం బాగా అర్థమయింది. ఆడైనా మగైనా ఈ ప్రపం చంలో ప్రతి మనిషికి కలలు కనే అధికారం వుంది. ఎవరి కలలు పండించుకోవటానికి వారికి అవకాశాలుండాలి. అవి అణచివేస్తే లోపల్లోపలే మనిషిని పీల్చి పిప్పి చేసే స్తాయి. నిజానికి ఈ అపాయింట్‌మెంట్ ఆర్డరు ఇది వరకు కూడా నీకిప్పించగలిగిన వాడినే.

నాతో నా భార్యగా వుండడాని మించి నీకు వేరే కలలు వుంటాయనే ఆలోచన నాకు రాకపోవడమే నా బలహీనత. ఇదొప్పు కోవడానికి నాకీరోజు ఏ మాత్రం ఇగో అడ్డం రావడం లేదు. ఈ ఘనకార్యం కేవలం నాదని కూడా చెప్పలేను. ఈ నాలుగు నెలలు మాష్టారితో వుండి ఇంకా ఏమేమి నేర్చుకున్నానో తెలుసుకుంటే ఇది చాలా చిన్న మార్పు అని నువ్వే ఒప్పుకుంటావు.

ఇది స్కూలులో ఉద్యోగం కేవలం పొద్దున్న వెళ్ళాలి. అవటానికి చిన్న ఉద్యోగమే కాని ఒకటి రెండేళ్ళు చేస్తే సాయంకాలాలు టుటోరియల్ కాలేజి కోచింగ్ తీసుకుని ఎమ్.ఏకి కట్టాలనుకున్నావుగా అదికూడా పూర్తిచెయ్యి. అప్పుడు మంచి జాబ్ వస్తుంది. చెప్పు నీకిష్టమేనా నా దగ్గరికి వెనక్కి రావటం. కనీసం కొన్నాళ్ళు ప్రయత్నించి చూద్దాం! నిన్ను పెంచి పెద్ద చేసిన పెద్దవాళ్ళకోసమైనా!'' గబగబా చెప్పి ఊపిరిపీల్చుకోవటానికి అన్నట్టు ఆగాడు. అప్పటికీ సుజా మాట్లాడలేదు.

''నేనే మాట్లాడుతున్నాను నువ్వేం అనటం లేదే మిటి? ఇంకా కోపమేనా, ప్లీజ్ సుజా ఏదో ఒక సమాధానం చెప్పు''

''ఏం మిగిలింది చెప్పటానికి? మీ తోడు లేకుండా బ్రతకలేను అని అనను కాని మీరిలాగే తోడుంటే ఎక్కువ హాయిగా నిశ్చింతగా బ్రతకగలనని ఇప్పుడనిపిస్తోంది. మీరునాతో ఎక్కువ టైము గడపటంలేదని నన్నొక మని షిగా గుర్తించటంలేదని బాధపడ్డానేగాని బయటప్రపం చంలో నెగ్గుకురావాలంటే ఈ ఐ.టి యుగంలో ఎన్ని సుఖాలు వదులుకోవాలో గ్రహించలేకపోయాను. మీకు నేనంటే లెక్కలేదనుకున్నాను. మీ ఉద్యోగబాధ్యతలలో తోడుగా వుండాల్సిన అవసరాన్ని గుర్తించలేదు. ఇంకె ప్పుడూ మిమ్మల్ని నాతో టైమ్ స్పెండ్ చెయ్యమని సాధిం చను'' మాట ఇస్తున్నట్టు అంది.

''అయ్యబాబోయ! ఆపని మాత్రం చెయ్యకు. నువ్వు సాధించకపోతే దెబ్బలాడకపోతే నాకు జీవితంలో మజానే చచ్చిపోతుంది. ఇదివరకులానే వుండు. ప్లీజ్'' నవ్వుతూ అన్న భర్తని చూసి తృప్తిగా నిట్టూర్చింది సుజా.

''ఇద్దరికీ ఎవరి ఉద్యోగం వాళ్ళకుంటే మంచిది ఒకళ్ళు ఖాళీగా వుండడంకంటే. అప్పుడు మన ఖాళీ సమయాన్ని ఒకళ్ళకోసం మరొకళ్ళు వెచ్చించగలం. అది ఎదురుచూస్తేనే కాని రాదు కనుక దాని విలువ పెరుగు తుంది కూడా'' మాధవ్ నచ్చచెపుతున్నట్టు అన్నాడు.

అతనిలోని మార్పుని చూసి ఆశ్చర్యపోవడం సుజాత వంతయ్యింది. ■

## తలరాత

ధరల మోత
కరెంటుకోత
ఉక్కపోత
పన్నుల దాత
కరుణించని ప్రకృతిమాత
కనికరించని నేత
బతుకే రోత
తప్పని తలరాత

కొల్లి మధుసూదనరావు